క్లుప్తంగా

బోరు ఏర్పాటు



పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ నిధులతో సర్పంచ్ వంగల లక్ష్మీదేవి బోరు వేయించారు. ముందుగా గంగమ్మకు భూమి పూజ చేసి బోరును తవ్వించారు. కార్యక్రమంలో వంగల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



వన్ టౌన్ పీఎస్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామాంజీనాయక్

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంలో నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, ఇతర ఫైల్స్‌ను పరిశీలించారు. అనంతరం వన్ టౌన్ సీఐ ప్రసాద్ రావు, టూటౌన్ సీఐ చంద్రబాబు నాయుడు తదితర సిబ్బందితో కలిసి రానున్న మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ఏఏ ప్రదేశాలలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారని విషయాన్ని ఆరా తీశారు. ట్రాఫిక్ జామ్ కాకుండా వాహనాల రాకపోకల నియంత్రణ కోసం ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏమిటన్న విషయంపై అడిగి తెలుసుకున్నారు.

మల్లన్నకు కొబ్బరికాయల సమర్పణ



గంగాధర మండపం వద్ద మల్లన్నకు కొబ్బరికాయలు సమర్పిస్తున్న కూటమి నాయకులు

శ్రీశైలం: ఎన్‌డీఏ కూటమి ఢిల్లీలో విజయం సాధించడంతో స్థానిక ఎన్‌డీఏ కూటమి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం బీజేపీ మండల అధ్యక్షుడు సదువుల శీను ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాస రెడ్డి, కూటమి నాయకులు గంగాధర మండపం వద్ద మల్లన్నకు 501 కొబ్బరికాయలను సమర్పించారు.

కేంద్ర బడ్జెట్‌తో పేదలకు ఒరిగిందేమి లేదు



మాట్లాడుతున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఒరిగిందేమి లేదని భారత మార్కిస్టు కమ్యూనిస్టు పార్టీ(ఐక్య) నాయకులు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో పేదలు, కార్మికులు, రైతులకు ప్రత్యేకం ఏమి లేదని చెప్పారు. ఈ నెల 23వ తేదీ కొత్తపల్లి మండల కేంద్రంలో జరిగే పార్టీ డివిజన్ వ్యవస్థాపక మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు డక్క కుమార్, మద్రిస్వామి, కృష్ణ, లక్ష్మిదేవి, రోజమ్మ పాల్గొన్నారు.

కుంభమేళాకు శివస్వాములు



కొత్తపల్లి నుంచి కుంభమేళాకు బయలుదేరిన శివస్వాములు

కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన 16 మంది శివస్వాములు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు ఆదివారం బయలుదేరి వెళ్లారు. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే మహాకుంభమేళాలో శివయ్యను దర్శించుకోవడానికి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

ఐఆర్, డీఏ బకాయిలు చెల్లించాలి

నంద్యాల(అర్బన్): ఉపాధ్యాయులకు రావాల్సిన 35 శాతం ఐఆర్ సత్వరమే ప్రకటించాలని, పెండింగ్ డీఏ బకాయిలను ఇవ్వాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవైష్ణవ కరుణానిధిమూర్తి అన్నారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల సమీపంలోని శివ గార్డెన్ ప్రాంగణంలో పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా పాల్గొన్నారు.



గుంతలమయమైన పోతులపాడు–చాబోలు రోడ్డు



రాళ్లు తేలిపోయి అధ్వానంగా మారిన రోడ్డు

ఈ రోడ్లపై వెళితే దబిడిదిబిడే..!

- అధ్వానంగా మారిన పోతులపాడు–చాబోలు రోడ్డు

జూపాడుబంగ్లా: పోతులపాడు–చాబోలు రోడ్డుపై వెళ్తే ప్రయాణికులకు నరకం కనిపిస్తోంది. రోడ్డు మొత్తం రాళ్లు తేలి గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు–గుంటూరు రహదారి నుంచి చాబోలు వరకు ఐదు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు వెంట నిత్యం అధికలోడు సామర్థ్యం ఉన్న వ్యాం కంపెనీ టిప్పర్లు తిరుగుతుండడంతో రోడ్డు ధ్వంసమైంది. అడుగుఅడుగున గుంతలమయంగా మారింది. ఐదు కిలోమీటర్ల దూరమున్న చాబోలుకు చేరుకోవాలంటే 50 నిమిషాల సమయం పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోతిరెడ్డిపాడు విస్తరణ పనులు చేస్తున్న వ్యాం కంపెనీ టిప్పర్లు 40 టన్నులకు పైబడి కంకర, ఇసుకలోడుతో రోడ్డు వెంట నిత్యం పదుల సంఖ్యలో తిరుగుతుండటం వల్ల రోడ్డు ఛిద్రమై గుంతలమయమైందని పోతులపాడు, చాబోలు గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు, గ్రామ పంచాయతీ సర్పంచ్ చర్యలు తీసుకొని గుంతలమయమైన పోతులపాడు, చాబోలు రోడ్డును బాగుచేయించి ప్రయాణం సవ్యంగా సాగేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అధిక లోడుతో వెళ్తున్న వ్యాం కంపెనీ టిప్పర్లు

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఆత్మకూరు: పీఆర్‌టీయూ నంద్యాల జిల్లాశాఖ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వై.రామపక్కిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ వైష్ణవ కరుణానిధిమూర్తి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేసి, కేక్‌కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో ఉపాధ్యాయుల కోసం స్థాపించిన సంఘం పీఆర్‌టీయూ అని, గతంలో పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ సంఘంగా ఆవిర్భవించిందన్నారు. అనంతరం ఉపాధ్యాయుల మెప్పు పొంది ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్‌గా రూపాంతరం చెందిందన్నారు. ఉపాధ్యాయుల కోసం అనేక జీవోలు సాధించి ఉపాధ్యాయ సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే సంఘంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కృష్ణారెడ్డి, నంద్యాల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.వి.భాస్కర్‌రెడ్డి, నాయకులు భార్గవ రామయ్య, గోపాల్‌రెడ్డి, విజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో కుక్కల దాడిలో ఆదివారం ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన చిన్న ఓబన్న ఉన్నత పాఠశాల సమీపంలో గొర్రెల మందను ఏర్పాటు చేసుకున్నాడు. కుక్కలు మందలోకి చొరబడి దాడి చేయడంతో ఐదు గొర్రెలు మృతి చెందాయి. మళ్లీ కుక్కలు గొర్రెల వద్దకు వస్తుండడంతో వాటిని తరిమాడు. దీంతో ఆగ్రహించిన కుక్కల యజమానులు గొర్రెల యజమాని ఓబన్నపై దాడికి పాల్పడడంతో గాయపడ్డాడు. ఈ విషయంపై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళకు తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: పప్పుశనగ పంటను నూర్పిడి చేసే యంత్రం కింద పడి ఆదివారం ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం వసంతాపురంకు చెందిన భూలక్ష్మి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో శనగ పంట నూర్పిడి పనులకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు యంత్రం కింద నిద్రకు ఉపక్రమించింది. గమనించని డ్రైవర్ ఆమెపై మిషన్ ఎక్కించడడంతో తీవ్రంగా గాయపడింది. తోటి కూలీలు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భోగేశ్వరంలో ప్రత్యేక పూజలు



భోగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

గడివేముల: రథసప్తమి సందర్భంగా శైవక్షేత్రమైన భోగేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రామానుజన్, ప్రధానార్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం నవగ్రహాల్లో సూర్యదేవుడికి విశేష ద్రవ్యాభిషేకం, అలంకరణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నప్రసాదాలు స్వీకరించారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో అనేక ప్రయోజనాలు

కొత్తపల్లి: మండలంలోని ప్రతి రైతు విశిష్ట సంఖ్య కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందేందుకు ఈ నంబర్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ నంబర్ పొందేందుకు రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటే రైతుభరోసా(అన్నదాత సుఖీభవ), పీఎం కిసాన్, ఈ–పంట నమోదు, పంట ఇన్సూరెన్స్, ఇతర పథకాలు వర్తిస్తాయని చెప్పారు. పొలంపాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానం అయిన ఫోన్ నంబర్‌తో రైతుసేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈనెల 20వ తేదీలోపు ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

పాములపాడు: అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు శివప్రసాద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు అన్నారు. ఆదివారం పాములపాడులో మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత భూమి లేకపోవడంతో 12 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేశాడన్నారు. అతివృష్టి, అనావృష్టి కారణాలతో దిగుబడులు సరిగ్గా రాకపోవడంతో సుమారు రూ. 30 లక్షలు అప్పుల పాలయ్యాడన్నారు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడం, అప్పులిచ్చిన వారికి సమాధానం చెప్పుకోలేక క్షోభకు గురయ్యాడన్నారు. చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. మృతుడి కుటుంబానికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, శంకరయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు పెద్దరామయ్య, రవికుమార్, మాబాషా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో వినతులు అందజేయవచ్చన్నారు.

వంతెన.. అంతేనా?

- జి.సి పాలెం వద్ద నిత్యం ప్రవహిస్తున్న మద్దిలేరు వాగు
- వానొస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం
- వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్న ప్రజలు
- నంద్యాల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల కూటమి నేతల ప్రతిపాదనలు



జీసీ పాలెం వద్దనున్న మద్దిలేరు వాగు

బండి ఆత్మకూరు: ఏళ్లు గడుస్తున్నా జి.సి పాలెం సమీపంలోని మద్దిలేరు వాగు సమస్యకు పరిష్కారం లభించడం లేదు. సాధారణంగా ఈ వాగును వ్యవసాయ అవసరాల కోసం తెలుగుగంగ ప్రధాకాలువకు అనుసంధానించారు. దీంతో నిత్యం నీళ్లు పారుతూనే ఉండటంతో జి.సి పాలెం – నారాయణాపురం గ్రామాల మధ్య రాకపోకలకు, పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు ఈ వాగు దాటాలంటేనే అష్ట కష్టాలు పడాల్సి వస్తోంది. వర్షాకాలంలో వరదల ఉధృతికి కొట్టుకుపోయి ప్రజలు మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. వాగును దాటేందుకు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జి.సి పాలెం – నారాయణాపురం గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

వేరే చోట బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

మద్దిలేరు వాగు నీరు జి.సి.పాలెం , లింగాపురం, రామాపురం, పార్నపల్లి, ఎ.కోడూరు గ్రామాల ప్రజల వ్యవసాయ అవసరాలను తీరుస్తూ నంద్యాల మండలం పులిమద్ది వద్ద కుందూలో కలుస్తుంది. అయితే ఇటీవలే ఎ.కోడూరు నుంచి పులిమద్ది మధ్య ఇదే మద్దిలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం కూటమి నేతలు రూ.4 కోట్ల తో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం గమనార్హం.

8 గ్రామాల ప్రజలకు ఇబ్బంది

జి.సి. పాలెం సమీపంలో ఉండే మద్దిలేరు వాగుకు వరద వస్తే బండిఆత్మకూరు మండలంలోని సుమారు 8 గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. రైతులు, గ్రామస్తులు, వ్యాపారులు వాగు దాటేందుకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా లింగాపురం, జి.సి.పాలెం గ్రామాల ప్రజలు పొలాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నా ఈ మార్గం గుండా వెళ్లాల్సిందే. ఇంతటి ప్రాముఖ్యమున్న ఈ వాగుపై వంతెన నిర్మించక పోవడంతో పాలకుల, అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు.

కల్వర్టు నిర్మాణం చేపడతాం


ఈ మధ్యనే ప్రాజెక్టు ఇంజినీర్లతో కొలతలు వేసి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం, ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మద్దిలేరు వాగుపై జీసీ పాలెం వద్ద కల్వర్టు నిర్మాణం చేపడతాం. – మురహరి రావు, డీఈఈ, పీఐయూ ఆత్మకూరు,

వాగు దాటాలంటే సాహసం చేయాల్సిందే



వర్షాకాలం వచ్చిందంటే జి.సి పాలెం, లింగాపురం గ్రామ ప్రజలకు ఇబ్బందులే. నా పొలం అవతలివైపు ఉన్నందున రోజూ పొలానికి వాగుదాటి పోవాల్సిందే. కానీ వర్షాకాలంలో అయితే వాగు దాటాలంటే సాహసం చేయవలసి వస్తుంది. రైతులు, రైతు కూలీలు పడే బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలి.
– .సుధాకర్ రెడ్డి, లింగాపురం

బ్రిడ్జి నిర్మించాలి



జి.సి పాలెం వాగుపై బ్రిడ్జి ని నిర్మించాలి. వర్షాకాలంలో రాక పోకలకు చాలా ఇబ్బందిగా ఉంది. వరద వచ్చినప్పుడు ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. పాలకులు స్పందించి ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మించాలి.
– అగుడూరు బలరామి రెడ్డి , రైతు (జి.సి.పాలెం)

రోడ్డు భద్రతపై అవగాహన



డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

శ్రీశైలంప్రాజెక్ట్: రోడ్డు భద్రత, సైబర్ క్రైం, మహిళలపై అఘాయిత్యాలపై ఆదివారం సాయంత్రం టూటౌన్ అవుట్‌పోస్టులో ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ స్థానిక డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడిపి, ఒక్కోసారి ఎదుటివారు చేసే తప్పుతో కూడా ప్రాణాలు కోల్పోతామని, డ్రైవర్లు వాహనాలను కండీషన్‌లో ఉంచుకొని భద్రత నియమాలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్‌ల వాడకం ఎక్కువైన తరువాత సైబర్‌క్రైం పెరిగిందని, అపరిచిత కాల్స్, పోస్టులపై స్పందించరాదని సూచించారు. అలాగే డిజిటల్ పేమెంట్‌లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ జి.చంద్రబాబు, ఎస్‌ఐ బి.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తనిఖీలు



సోదాలు నిర్వహిస్తున్న మహానంది ఎస్‌ఐ

మహానంది: నంద్యాల జిల్లా ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్ ఆదేశాల మేరకు మహానంది పోలీసులు గ్రామాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులు బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి, పలువురి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మేళ తాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

12న పున్నమి పూజ



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి

నందికొట్కూరు: ఈ నెల 12వ తేదీ జరిగే భారతాల పున్నమి మహోత్సవాన్ని భక్తులు విజయవంతం చేయాలని చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చింతా రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న ఉదయం 9:30 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో పంచముఖి వినాయకుడి దేవాలయం వరకు చెక్క భజన కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు అమ్మవారి ఆలయంలో పున్నమి పూజ నిర్వహిస్తునట్లు చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. తొగట వీరక్షత్రియులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ప్రతి రైతు పేరు నమోదు చేసుకోండి

జూపాడుబంగ్లా: ఆధార్ తరహాలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా ఐడీ నంబర్ ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సొంతంగా అర ఎకరంపైబడి పొలం ఉన్న రైతులంతా ఆయా గ్రామాల్లోకి రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను ఐడెంటిటీ నంబర్ ఆధారంగా అందజేస్తుందని తెలిపారు. గుర్తింపు నంబర్ పొందేందుకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆధార్‌తో లింక్ అయిన సెల్‌ఫోన్, పాసుపుస్తకం జిరాక్సు, లేటెస్టు వన్‌బీ, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్సు కాపీలను తీసుకొని రైతులు స్వయంగా రైతుసేవా కేంద్రం వద్దకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుని రైతు ఐడీ నంబర్ పొందాలని సూచించారు. ఈ ఐడీ నంబర్ లేని వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందవని తెలిపారు.

చందాలు వసూలు చేస్తే చర్యలు

కొత్తపల్లి: సంగమేశ్వరం దేవాలయం పేరు చెప్పి చందాలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ రామలింగారెడ్డి ఆదివారం తెలిపారు. ఆలయం పూర్తిగా దేవదాయశాఖ పరిధిలో ఉందని చెప్పారు. ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా దేవాలయ అభివృద్ధి కోసం కరపత్రాలు పంపిణీ చేస్తూ చందాల కోసం వస్తే ఎవరూ నమ్మవద్దని తెలిపారు. చందాల కోసం వస్తే దేవదాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దామోదర సంజీవయ్య సేవలు మరవలేనివి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదర సంజీవయ్య అందించిన సేవలు మరవలేనివని జేఏసీ నాయకులు జయరాముడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు అన్నారు. ఆదివారం పట్టణంలోని జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే దామోదర సంజీవయ్య జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. జయంతి కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో రాజ్‌కుమార్, డాక్టర్ రాజు, వనజ, కౌన్సిలర్ లాలు, షకీలా అహ్మద్, స్వామినాథం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



పేదల వివరాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: ఎన్నికల ప్రచారంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత చర్యలు చేపట్టకపోవడం ఎంత వరకు సమంజసమని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని 8వ వార్డులో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల జాబితాను సీపీఎం నాయకులు తయారు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇళ్ల స్థలాల గురించి ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. అధికారం కోసం సీఎం చంద్రబాబు నాయుడు కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా చేతులు ఎత్తేయడం సిగ్గు చేటన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలంటూ తలపెట్టిన ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు ఫక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, షబ్బీర్, గోకారి, శేషు, పద్మావతమ్మ, ఫర్హాన్, ఖాజాబీ, రాజేశ్వరి, పాపులమ్మ, నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు



ఎమ్మెల్యే బుడ్డాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సూచించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఆలయ వేద పండితులు, అర్చకులు ఆదివారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలు అందించారు. ఆలయంలో చేపడుతున్న పనులను, ఏర్పాట్లను వివరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఏఈఓ మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

25 నుంచి ఓంకారంలో శివరాత్రి ఉత్సవాలు

బండి ఆత్మకూరు : మండల పరిధిలోని ఓంకార పుణ్య క్షేత్రంలో ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు శివరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. శివరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రధాన అర్చకులు మల్లికార్జున రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.